కొండ కనిపించడం మానేసి రెండేళ్ళయింది. 'కళ్ళెట్టి సూడు బాబూ అల్లదిగో నా కొండ' - అంటుంది సీతాలు. కొండ దిగువన దానికో పాక వున్న మాట నిజమే. అయితే దానికి మాత్రమే కనిపిస్తూ మనకు పోలికతోచని కొండడు సీతాలు కొడుకు.

తప్పిపోయిన కొడుకు

కొండేపూడి నిర్మల

కనిపించని దాని కొడుక్కెప్పుడో మీసాలు వచ్చేసి వుంటాయి. మోసాలు వచ్చేసి వుంటాయి. లోకంలో ఎన్నెన్ని కొండలు తల్లి పేగును మెలి పెట్టిపారిపోయాయో ఇప్పుడెక్కడున్నాయో-

నిజమనేది కళ్ళకి దొరుకుతుందా? మనసుకి దొరుకుతుందా? కళ్ళనీ మనసునీ విడదీసి చూడాల్సిన పరిస్థితి ఏదో ఒకరోజు జీవితంలో వస్తుంది.

మోసపోవడమనేది ఆనందమే, ఎప్పటి దాకా అంటే మోసమని తెలిసే దాకా!

మనసుకి తోచిందే స్వప్నమూ స్వర్గమూ అని కనక మనం కాసేపు నమ్మినట్లయితే దాని కొడుకు కళ్ళెదుటే వున్నట్టు లెక్క.

'అత్తా నీ కొండకి గాలిపటం కావాలంట డబ్బులడిగి బేగి రమ్మన్నడు' 'లప్పీకీ వాడే అడగొచ్చుగా' నవ్వుకుంటూ కొంగుముడి విప్పి చిల్లర తీసి యిస్తుంది. పాతబడిన నిక్కరూ చొక్కా ఉతికి బెంచి స్త్రీ చేస్తుంది. ఉన్నట్టుండి ఒక్కోరోజు పొద్దున్నే పొయ్యి రాజేసి పకోడీలూ పునుగులూ చేస్తుంది.

'నడిచి నడిచి వస్తాడమ్మా బిడ్డ, ఆకలెయ్యదూ' అంటుంది. చేతి మీద గిచ్చుకుంటే తప్ప నుంచున్నట్టో కూచున్నట్టో నమ్మలేకపోతున్న ఈ మాయాజాలంలో హామీల్లేని మినహాయింపుల్లేని చెత్తకుండీ జీవితాల్లో దాని మంత్రనగరి ఆనందం ఓ చోద్యంగా వుంటుంది. దాని నమ్మకాన్ని చిత్తుకాయితంలా చేసి ఎగరెయ్యడం వినోదంగా వుంటుంది.

'బతికే వున్నాడంటావా సీతాలూ వుంటే ఎందుకు రాడూ'- అంటారెవరో

'నోర్ముయ్యండోస్, గుళ్ళు మొహోల్లారా' భళ్ళున తలుపేసేస్తుంది. గొలగొలగా నవ్వుకుంటూ పారిపోతారంతా.

లాంతరు లోంచి గుప్పున చిమ్మిన పొగలాంటి భయం- అప్పుడొస్తుంది దానికి కరేల్మని కడుపులో పేగు కదిలిన నొప్పి- ముద్దగా గొంతుకేదో అడ్డుపడిన నొప్పి- మన్నుతో మెత్తి చీపురుపుల్లతో గీతలు గీసినట్టున్న దాని మొహంలో ఎడారి పగులు!

'లేడంటావా నా బిడ్డ రాడంటావా' తనలో తనే గొణుక్కుంటుంది సమాధానం చెప్పుకుంటుంది.

చటుక్కున పొయ్యిలో నీళ్ళోసి ఆర్పేసి-

'వస్తా మూసొస్తా చెవి పుచ్చుకుని మరీ లాక్కొస్తా' అంటూ వేళ్ళతో జుట్టు ముడేసుకుని రోడ్డెక్కుతుంది.

రోడ్లమీద బురదా రొచ్చూ పెంటా మునిసిపాలిటీ ముద్దుబిడ్డలైన పంది కూనలతోబాటు అప్పుడప్పుడూ ప్రశ్నార్థకాలూ దొరుకుతాయి. అలా దొరికిన ప్రశ్నార్థకమే కొండడు. కొండ, సీతాలుకి కన్నబిడ్డ కాదు!

బూదిలో మిగిలిన ఎముక ముక్కలా దీనంగా హీనంగా దొరికిన కొండడ్ని పెంచడమంటే వత్తి మెదిపి దీపం వెలిగించడమే! ఆ పని చేసింది సీతాలు. వాడికిప్పుడు పధ్నాలుగేళ్ళొచ్చాయి. ఎబీసీడీ లొచ్చేసి, కచకచా తనకు రాని బాసలో ఏదోదో అనేస్తున్నాడని తెలుసు కానీ బీడీలూ బీబీలూ దాటిపోయాడని ఇంకా ఇంతకంటే సుఖం యింకెక్కడో దొరుకుతుందని విని తను పుట్టిన రొచ్చులాంటి ముసిల్దాని ప్రేమ లాంటి చద్దెన్నం ముద్ద లాంటి పల్లె విడిచి బస్తీకి పారిపోయాడని ఎన్ని సాక్ష్యాలతో చెప్పినా అది నమ్మదు.

'వాడుత్త చవట సన్నాసి! రాలుగాయి మూకలు చేసిందయ్యా యిదంతా' అంటుంది ముందే చెప్పినట్టు మోసపోవడం దానికి ఆనందాన్నే యిచ్చిందేమో! కాందిశీకురాల్లా ఊరి పొలిమేరల్లోకొచ్చేసిన సీతాల్ని ఓ దృశ్యం పట్టి ఆపేసింది.

ఇరవయ్యేళ్ళ యువకుడొకడు తల్లిని బరబరా బైటికీడ్చుకొచ్చి గొడ్డును బాదినట్టు బాదుతున్నాడు.

తియ్ తియ్ డబ్బులు తియ్ అంటున్నాడు. ఆ ముసిల్ది కూడా వూరుకోలా! చేతికిదొరికిన కట్టె పేడు తీసి విసిరింది.

పైసా యివ్వ నా ఛావు, నీ కాళ్ళు విరగ, చేతులిరగ, తలపగల శివాలెత్తిపోతూ అరుస్తోందది. ఎలాస్టిక్ ముక్కలా వచ్చిన అక్కడికి చేరుకుంది సీతాలు. ముసిల్దాన్ని పట్టుకుని ఆపింది.

'బిడ్డలేని బాధేమిటో నాకు ఎరుక. తిట్టకమ్మా అలా తిట్టమాకు. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుద్ది. పైసలే కదా వాడడిగింది, యిచ్చెయ్యి-యిదిగో చూడు యిన్ని పైసలున్నాయి కొడుకు లేడు. కాదు వాడికి నేను లేను వాడ్నేమైనా అంటే వొట్టే' అని చెప్పి విసవిసా నడుచుకుంటూ యింటి కొచ్చేస్తోంది.

మాతృత్వం నేరమౌతున్న చోట, మమకారం సంకెల అవుతున్నచోట, పైసాకొక బొట్టు లెక్కన బాంధవ్యాలు అమ్ముడుపోతున్న చోట

దిబ్బమీదకి విసిరేసిన చాటలాంటి జల్లెడ లాంటి దిక్కులేని తల్లికి, రోగంతో రొచ్చుతో మంచాన పడివున్న తల్లికి తప్పిపోయిన కొడుకు ఒక బంగారు కొండ.

భ్రమణ గృహం

ఉష్ణ దేశంలో సూర్యుడికి భయపడి ఓ ఇంటి కప్పుకింద తలదాచుకుంటారు గానీ, హిమవర్షం, అతిశీతల వాతావరణం వున్న దేశాల్లో సూర్య దర్శనం కోసం జనం వాచిపోతూ వుంటారు. సూర్యుడు కనిపిస్తే చాలు ఒంటిమీద నూలుపోగైనా లేకుండా ఆ కిరణాల వానలో వెచ్చగా తడుస్తూ వుంటారు. ఇల్లు విడిచి సూర్యుడి కోసం ఆరుబయటికి పోనవసరం లేకుండా ఫ్రాన్స్ దేశంలో ఓ కంపెనీవారు పారదర్శకంగా వున్న పైకప్పుతో సూర్యుడు ఎటువుంటే అటువేపు తిరిగేలా కలపతో ఈ ఇంటిని నిర్మించేరు. రివాల్వర్ అమర్చిన టేబిల్ ఫేను రెండువేపులా తిరిగినట్లు, సూర్యుడితోపాటు అతని దిక్కుగా ఈ ఇంటిని కూడా తిప్పుకోవచ్చు. 320 చదరపు మీటర్ల వైశాల్యం వున్న ఈ ఇంటి ఖరీదు లక్ష డాలర్లు మాత్రమే!



వెలుగుల ముసుగు

అర్ధరాత్రి అందరూ లైట్లార్పి నిద్రపోతున్నప్పుడు దుప్పటీ కప్పుకుని పరమ రహస్యంగా ప్రేమలేఖని చదువుకోలంటే ఎలా? ఈ దుప్పటీ కప్పుకుంటే దానికి సమాధానం లభిస్తుంది. ప్రియురాలి ఉత్తరాన్ని ఏకాంతంగా చదివే భాగ్యానికి నోచుకోలేక కాబోలు ముప్పై మూడేళ్ళ టేరీ సాఫెట్టీ ఈ దుప్పటిని కనిపెట్టాడు భాస్వరపు ద్రావకంలో ముంచి తీసిన ఈ దుప్పటి అన్నిలైట్లూ అర్పిన ఓ గంటకి మెల్లగా కాంతులు జల్లుతూ ముసుగులో వెలుగుల మూట విప్పుతుంది. ఇక హాస్టల్స్‌లో ఇలాంటి దుప్పట్లే సరఫరా చెయ్యాలని విద్యార్థి సంఘాలు ఆందోళన మొదలు పెడితే ఆశ్చర్య పోనవసరం లేదు.

ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు

ఏ ఆధారం లేకుండా, అప్పుడప్పుడే అడుగులు నేర్చిన పసికందుకి తప్పటడుగులే మధురానుభూతి. అలాగే నేలనంటి నడిచే మనిషికి, ఉన్నట్టుండి గగన తలం లోకి ఎగిరిపోవడం ఓ సంభ్రమానుభూతి, చిట్టి అడుగుల పాపాయికి, ఆ దశలో ఆనందంతో పాటూ, భయం కూడా, ఎలా వెన్నంటి వుంటుందో, విమానంలో తొలిసారి వెళ్తున్న మనిషి కూడా అటువంటి అనుభవానికే లోనౌతాడు.

ఒకవైపు కాలి కింద భూమ్యాకర్షణ శక్తి శరీర భారాన్ని మొత్తంగా కింద వేపు లాగేస్తుంటే, దానికి కొన్ని రెట్లు అధికమైన యాంత్రిక శక్తి మరోవైపు విను వీధిలోకి ఎగరేసుకు పోతుంటే దూది పింజలా ఒళ్ళు తేలిపోతుంది.

ఈ భిన్న శక్తుల పరస్పర క్రీడలో బంతిగా మారిన మనిషి ఓ పక్క సంతోషిస్తున్నా, మరో వేపు ఒక రకమైన మానసికావస్థకీ, ఆందోళనకీ, వికారానికీ, సహజంగానే లోనవుతాడు.

విమాన యాత్రికులు లోనయ్యే ఈ స్థితిని దృష్టిలో వుంచుకుని జరిపిన ఒక సర్వేలో కొన్ని లక్షల మంది విమాన యానంలో ఒక రకమైన భయానికి గురి అవుతున్నారని వెల్లడయింది. కొద్ది మంది రేపు విమానం ఎక్కబోతుండగా ఈ రోజు ఆత్రుతకి లోనౌతుంటే, మరి కొందరు వారం రోజుల ముందు నుండే వింత భయానికి గురవుతారని తేలింది. పరీక్షకో, ఇంటర్‌వ్యూకో వెళ్తున్న వ్యక్తులు ఎలాంటి అవస్థలు పడతారో అలాంటి ఉద్రిక్తత విమానా యాత్రికులలో చోటు చేసుకుంటుంది. ఫలితంగా నిద్ర పట్టక పోవడం, తిండి సహించక పోవడం, ఒంట్లో వికారం లాంటివి మొదలవుతాయి. అందువల్ల విమానాశ్రయానికి



చేరుకుని ఆఖరి నిమిషంలో విమానం ఎక్కబోయే ముందు ప్రయాణం రద్దు చేసుకుని తిరుగు ముఖం పట్టే వాళ్ళు కూడా వున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో విమానం ఎక్కవలసి వస్తేవారి అవస్థ వర్ణనాతీతం. ఒకయాత్రికుడు కండరాన్ని బిగపట్టి ఊపిరి తీసుకోడం కష్టమై, బల్లిలా సీటుకు అంటుకు పోతాడు. ఒకామె పక్క సీట్లో వున్న భర్త చేతిని, తడి గుడ్డని పిండినట్లు, పిండివేస్తూంటుంది. విమాన యాత్రలో ఈ ఉద్రిక్తతనీ, దుర్భరమైన మానసికావస్థనీ అధిగమించడానికి ఆ సర్వే నిర్వాహకులు కొన్ని సలహాలు సూచించేరు.

* విమాన యానం మొదటి సారిగా చేయవలసి వస్తే వారు మానసికంగా సిద్ధపడాలి. విమానాశ్రయపు వాతావరణాన్ని అలవాటు చేసుకోవాలి.

* ప్రయాణానికి కొద్ది రోజుల ముందుగా సమీపంలో వున్న విమానాశ్రయాన్ని సందర్శించాలి.

* విమానం బదల్దేర డానికి కనీసం ఒక గంట ముందుగా విమానాశ్రయం చేరుకోవాలి. అలా అయితే నిబంధనల మేరకు అక్కడి జరపవలసిన తతంగాన్ని సకాలంలో నిర్వహించడం వీలౌతుంది. అలా కాకుండా ఆఖరి నిమిషంలో బండెడు సామాన్లతో అక్కడికి రొప్పుకుంటూ చేరుకుంటే ఆందోళన తప్పదు మరి.

* మన మానసికావస్థనీ, చర్యల్నీ అర్థం చేసుకునే వ్యక్తితో కలిసి చేసిన ప్రయాణం, కొత్త వారికి ఎంతో హాయిని కలిగిస్తుంది.

* సీట్లో కూర్చుని, బెల్టు నడుముకి బిగించుకున్నప్పుడు అదొక రక్షక వుపకరణంగా భావించాలే తప్ప, ఏదో బంధనకు గురవుతున్నట్టు భావించ కూడదు.

* సీట్లో బిగిసుకుపోకుండా, గుండె నిండా గాలి పీల్చుకుని కాళ్ళు మెల్లగా, ఆడిస్తూనో, చేత్తో జుట్టుని సవరించుకుంటునో వుంటే, దృష్టిని సాధారణ స్థితివేపు మళ్ళించడానికి వీలవుతుంది.

* మౌనంగా వుండిపోకుండా, సాధ్యమైనంత వరకూ తోటి ప్రయాణీకుల్తోసంభాషించడం మంచిది. ఎదుటి సీట్లో పసివాళ్ళుంటే, వారి వేపు వాత్సల్యంగా చూస్తూ, ఆదర పూర్వకంగా పలకరించడం వల్ల మనసు తేలిక పడుతుంది.

* అన్నిటి కన్నా ముఖ్యం- విమానం ఎక్కే ముందు ఎటువంటి మత్తు పానీయాల్ని గానీ, మాక ద్రవ్యాల్ని గానీ తీసుకో కూడదు.

ఈ సలహాల మేరకు ఎంత దూరానికైనా చేరుకోడం, ఈ శతాబ్దపు జీవిత విధానంలో ఒక భాగంగా గుర్తించి, ప్రశాంతమైన మనసుతో విమానంలోకి అడుగు పెడితే- ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు అని పాడుకోవచ్చు -

– పవన్